# మనిషి ధర్మం

వాకింగ్ కు వెళ్ళొచ్చిన లాయరు పరమేశం తన ఇంటి మెట్ల మీద కూర్చున్న ఆమెను చూసి " ఏవరమ్మా నువ్వు....ఎందుకు వచ్చావ్..? " అనడిగాడు. ఆయన మాటల్లో చిరాకు స్పష్టంగా తెలిసింది ఆవిడకు. లేచి నిలబడుతూ భుజం చుట్టూ కప్పుకున్న కొంగును నడుముకు దోపి " మీతో ఒక కేసు గురించి మాట్లాడాలని వచ్చానండీ...!" అంది.

ఆయన చాలా మర్యాదగా " లోపలకు వచ్చి కూర్చోండి.." అని చెప్పాడు. లోపలకు వెళ్ళిన ఆయన అయిదు నిమిషాల్లోనే తిరిగి వచ్చి ఆవిడ కూర్చున్న కుర్చీకి ఎదురుగా ఉన్న టేబుల్ కి అటుపక్కగా ఉన్న తన కుర్చీలో కూర్చుని " ఇపుడు చెప్పండి...మీ పేరూ, కేసు వివరాలూ..." అనడిగాడు.

ఆవిడ పెదవులపైకి అదోవిధమైన చిరునవ్వు వచ్చింది.

" అసలు పేరు కాదుగానీ అందరూ 'బంగారమ్మా అంటారు.." అని ఆవిడ అనగానే ఆయనా నవ్వుమొహంతో ఆవిడను మళ్ళీ ఓ మారు తేరిపార చూసి " నగల దుకాణంలా ఉన్న మీకు ఆ పేరే సమంజసంగా ఉంటుందని అలా పిలుస్తూ ఉంటారేమో...!" అన్నాడు.

ఆవిడ కూడా చిన్నగా నవ్వింది. " ఇన్ని నగలు వేసుకుని తిరగటం నాకూ ఇష్టం ఉండదండీ. పైగా ఒంటిమీద తేళ్ళూ, జెర్రెలూ పాకుతున్నట్లు కంపరంగానూ ఉంటుంది! ఈ మాట అంటే, మా ఆయన అస్సలు ఒప్పుకోడు. ఐశ్వర్యం వల్లే పరపతి పెరుగుతుందని వాదిస్తాడు. అసలు ఈ నగలవల్లే నాకు విలువ అంటాడు. అది నిజమేనని ఈ రోజు రుజువైంది కూడా ! మరి వీటిని చూసాకనే కదండీ...నన్ను లోపలకు వచ్చి కూర్చోమని మర్యాదగా చెప్పారూ...!"

పరమేశం కోపాన్ని అదుపులో పెట్టుకుంటూ ఆవిడ వైపు చురచుర చూసి ఏదో మెల్లగా గొణిగినట్లు అన్నాడు.

ఆవిడ నొచ్చుకుంటున్నట్లుగా మొహం పెట్టింది.." మిమ్మల్ని తప్పు పట్టానని అనుకోకండి. లోకరీతి గురించి మా ఆయన చెప్పిన మాటలు నిజమేకదాని మనసులో అనుకున్న విషయాన్ని మీతో చెప్పేసాను. ఎవరమైనా అంతేకదండీ..! ఎవరో ఏమిటో, నా తాహతేమిటో తెలియకుండా లోపలకు ఎలా రమ్మనగలరూ..! వృత్తి ,అధికారం, ఐశ్వర్యం..ఇలా ఏదో ప్రత్యేకతను బట్టే మనిషికి

గౌరవ మర్యాదలు దక్కుతాయిగానీ, ప్రవృత్తిని బట్టి గౌరవించటం ఎలా కుదురుతుందీ ! ఇది నిజమేగా. పరిచయం పెరిగాకనే కదండీ ఎవరి గురించైనా ఓ అభిప్రాయానికి రాగలం..! అందుకే మా ఆయన చెప్పిన మాటల్లోనూ నిజం ఉందనిపించి..అలా అన్నాను..! "

ఆ మాటలకు ఆయన కొంచెం శాంతించినట్లుగా ప్రసన్న వదనంతో చూస్తూ మళ్ళీ పేరు, కేసు వివరాలూ అడిగాడు.

నా వివరాలతో అవసరం లేదనుకుంటా. మీరు కేసు వివరాలు విని వాదించటం కోసం కాకుండా, మీరు తీసుకున్న ఒక కేసు గురించి వాదించకుండా ఉండటానికి ...మిమ్మల్ని ఒప్పించి ఫీజు ఇవ్వాలని వచ్చాను. మరి నా పని సానుకూలం అవుతుందో లేదో..తెలియదనుకోండీ...!" అంది నిట్టూరుస్తూ.

ఆయన ఆశ్చర్యంగా చూసి " కేసును వాదించకుండా ఉండటానికి ఫీజు ఇస్తారా...!!ఆశ్చర్యంగా ఉంది. వివరంగా చెప్పండి..!" అన్నాడు.

మీరు వాదించాల్సిన కేసు నుండి విరమించుకుంటే...మీకు నష్టపరిహారంగా ఫీజు ఇవ్వాల్సిందే కదండీ ! మీరు పదే పదే ప్రశ్నలు అడగాల్సిన అవసరం లేకుండా విషయమంతా నేనే చెప్పేస్తా !

కొందరు లాయర్లు భారీ ఫీజు ఇచ్చేవాళ్ళ విషయంలో నిజనిజాల ప్రసక్తిని వదిలేసి, అపరాధినయినా శిక్ష నుండి తప్పించగలుగుతారు ! ఆ గెలుపు కోసం కట్టుకథల్ని అల్లుతారు, అబద్ధపు సాక్ష్యాల్ని సృష్టించగలరు కూడా ! వాక్చాతుర్యంతో, వాదనాపటిమతో అపరాధిని రక్షించటానికి గాను ఓ నిరపరాధిని బలి చేయటానికీ వెనుకాడరు ! ఫీజు అంతటి ప్రభావం చూపించగలుగుతుంది !

అందరూ అంతే కాదని తెలుసనుకోండీ...కానీ కొంతమంది మాత్రం ధన ప్రభావానికి లొంగి, తెలిసే అన్యాయానికి అండగా నిలబడటం చూస్తూంటే బాధేస్తుంది !

ఇప్పటివరకూ మీరు తీసుకున్న ఏ కేసులోనూ అపజయమన్నది లేనే లేదని విన్నాను. అందుకే..." అంటూ ఆమె ఒక క్షణం ఆగి తర్వాత తనదగ్గరున్న చేతిసంచినుండి నోట్లకట్టలు కొన్ని తీసి టేబుల్ పై ఉంచి చేతిరుమాలు వాటిపై పరిచింది.

" వేలం పాటలో పాల్గొన్నట్లుగా...నిన్న మీరు అంగీకరించిన ఫీజు కంటే ఎక్కువ ఫీజు ఇచ్చి అపరాధి తరఫున వాదించవద్దని మిమ్మల్ని అర్థించటానికి వచ్చాను ! ఇప్పటికి ఇది మాత్రమే నాకు తోచిన

ఆలోచన! ఆ తర్వాత...ఏ పుణ్యాత్ముడైనా తను కళ్ళారా చూసిన నిజాన్ని సాక్ష్యంగా చెప్పటానికి నిర్భయంగా ముందుకు రాకపోతాడా అనే ఆశ కూడా ఉందనుకోండి..!"

ఆ మాటలు వింటూనే ఆయన తృళ్ళిపడి " అంటే...మీరు ఆ డాక్టరుగారికి ఏమౌతారు ? బంధుత్వం ఏమిటి...ఇంత ధైర్యంగా అనంతయ్యగారికి వ్యతిరేకంగా ...ఎలా...ఎలా...?" అంటూ మాటలు పూర్తిచేయలేక దిగ్భ్రాంతితో చూశాడు ఆమె వైపు.

ఆవిడ నిట్టూర్చింది.

తలవొంచుకుని మెల్లగా చెప్పింది. " నిజం చెప్పాలంటే ఈ కేసులో నిరపరాధి అని నేను భావిస్తున్న డాక్టరుగారితో నాకు ఎటువంటి బంధుత్వమూ లేదు ! ఇక...అనంతయ్య గారు..మా వారే ! "

పరమేశం తృళ్ళిపడినట్లుగా చూసి మరింత ఆశ్చర్యంతో " నిజమా..?" అనడిగాడు. ఆయనకు విషయం ఏమిటో అర్ధంకాక తికమకగా అనిపించింది !

ఆ విషయం గ్రహించిన ఆవిడ వివరంగా చెప్పుకొచ్చింది.

మావారి అనుచరుడొకడు వ్యక్తిగత కక్షతో ఒకరిని ఒక హాస్పిటల్ ముందు అందరూ చూస్తుండగానే పట్టపగలు నడిరోడ్డు మీద చంపేశాడు ! వాళ్ళిద్దరి ఘర్షణను ఆపాలని ప్రయత్నించిన ఒక డాక్టరుపై హత్యానేరాన్ని నెట్టేశారు ! తన అనుచరుడిని కాపాడటం యజమానిగా తన ధర్మం అని ఆయన అనుకున్నారు.

నేనీ మధ్య ఇక్కడ లేను. మా పిల్లల దగ్గరకి వెళ్ళి ఓ వారం క్రితం వచ్చాను. ఈ విషయం తెలిసి నేను చాలా ఆశ్చర్యపోయాను ! జనాల మధ్యకు వెళ్ళి నిజం తెలుసుకున్నాను ! కేవలం భయంతో మాత్రమే ఎవరూ సాక్ష్యం చెప్పటానికి ముందుకు రాలేదని అర్ధం అయింది ! అందుకే న్యాయం వైపు నిలబడాలని నిర్ణయించుకున్నాను ! మా వారికి వ్యతిరేకంగా పనిచేయమని ఆయన డబ్బునే మీకు ఇస్తున్నానని అనుకోకండి ! నేను నిత్యమూ నాలుగైదు పాడి పశువుల పోషణ చేస్తూ , ఆ ఆదాయాన్ని నా అవసరాలకి

పోను మిగతాది పొదుపు చేస్తుంటాను ! అంతేకాదండీ...వ్యాపార నిమిత్తం ఆయన దుబాయ్ లాంటి దేశాలకు వెళ్ళి కొన్నాళ్ళు అక్కడే ఉండిపోతారు ! అటువంటప్పుడు నేనూ ఇతరులతో కలిసి మా పొలంలోనే పనిచేసి సంపాదిస్తుంటానుకూడా ! ఇదంతా మీకు ఎందుకు చెబుతున్నానంటే...నాకు నా అభీష్టాలకు, అవసరాలకూ నా కష్టార్జితం వేరేఉంటూందని తెలియజేయటానికే ! మీకు ఫీజుగా ఇచ్చింది కూడా నా డబ్బు మాత్రమేనండీ !

అరపై ఏళ్ళ వయసు పైబడిన డాక్టరు...ధృడంగా వస్తాదులా ఉన్న మనిషిని తేలికగా చంపేయగలిగాడంటే..ఎవరైనా నమ్మలేకపోవచ్చుగానీ, లాయరు మాత్రం నమ్మితీరతారని నాకు అర్ధమైంది ! "

పరమేశం ఆవిడ మాటలకు అడ్డం వచ్చి...ఏమో...ఏదైనా జరగవచ్చునుగానీ..అక్కడ ఉన్న జనాలు మీకు నిజమే చెప్పారని నమ్మకం ఏమిటీ ? పోలీసులకు సాక్ష్యం చెప్పటానికి ముందుకు రాకపోవటంలో ఆంతర్యం ఏమైఉంటూందీ..?"

ఆవిడ లాయరువైపు ఆశ్చర్యంగా చూసింది. " మీరు కోర్టులో వాదిస్తున్నట్లుగా ప్రశ్నలు వేస్తున్నారనిపిస్తోంది ! అపరాధిని తప్పించటం కోసం...మాటల్ని మెలితిప్పే చాకచక్యం చూపించి...ఒక్కోసారి విజయమూ సాధిస్తుంటారు ! మాటల చాతుర్యం మనసును రంజింపచేయాలేగానీ, నిరపరాధుల్ని శిక్షించటానికి మాత్రం ఉపయోగపడకూడదు కదండీ..?"

ఆవిడ మాటల్లోకి కొంచెం పదును వచ్చింది.

ఆ డాక్టరుగారితో పరిచయం, స్నేహంలాంటివి లేకపోయినా ఒకసారి ఎపుడో ఆ హాస్పిటల్ కి వెళ్ళాల్సిన అవసరం వచ్చింది. అప్పుడే, ఆయన ప్రవృత్తి ఎలాంటిదో తెలుసుకోగలిగాను ! అందుకే జనాల మాటల్ని విని నేనూ నిజమని నమ్మాను ! గెలుపు కోసం ఏమైనా చేయగల లాయరుబారి నుండి ఆయనను తప్పించాలని తాపత్రయపడుతున్నాను !

నా మాటలకు ఆధారంగా జరిగిన ఎప్పటిదో ఒక చిన్న సంఘటన చెప్పటం సమంజసమే అనుకుంటున్నాను. మీరు నమ్మినా, నమ్మకపోయినా ఈ విషయం మీకు తెలియజేయటం నా భాధ్యతగా భావిస్తున్నా. చాలానాళ్ళక్రితం ఏదో అనారోగ్యం కారణంగా నేను ఆ డాక్టరుగారి దగ్గరకు వెళ్ళి..నిరీక్షిస్తూ కూర్చున్నప్పుడు కాంపౌండర్ తో ఆ డాక్టరు చెప్పిన మాటలు వినటం జరిగింది. ఆయన అపుడు ఎవరికో ఆపరేషను చేయటం జరిగిందనీ, మందులకు డబ్బు లేదని వాళ్ళంటే, ఆయనే ఇచ్చారనీ వాళ్ళ సంభాషణ వలనే నాకు తెలిసింది. డాక్టరుగారికి వారసత్వంగా వచ్చిన స్థలాన్ని కబ్జా చేసిన నాయకుడి అనుచరుడి కొడుకు కి ఆపరేషను చేయటం వరకూ ఫరవాలేదుగానీ, మందులకూ డబ్బు లేదని అబద్ధం చెబితే , అమాయకంగా నమ్మి సాయం చేయటం సరికాదని కాంపౌండర్ నిష్ఠూరంగా  మాట్లాడటం విన్నా. ఆ మాటలకు జవాబుగా డాక్టరుగారు ఏమన్నారో తెలుసాండీ... ' అతను చెప్పిన మాటలు నిజం కాకపోవచ్చునుగానీ, ఆ పిల్లవాడు అనుభవిస్తున్న బాధ మాత్రం నిజమే కదా ! మనం చూశాంగా ! ఆపరేషను అయ్యాక వాడాల్సిన మందులు వాడకపోతే మనిషికి ఏటువంటి నష్టం జరుగుతుందో నాకు తెలుసు. ఆర్థిక నష్టం అనేది అదేమంత పెద్ద విషయం కాదు. అనారోగ్యంతో మన దగ్గరకు వచ్చిన పిల్లవాడు ఆరోగ్యంగా వెళ్ళగలగటం మనకూ ఆనందమేగా ! ఇంకో మాట. మన హాస్పిటల్ కి వచ్చేవాళ్ళ రోగం ఎటువంటిదీ, ఎలాంటి అనారోగ్యానికి ఏ వైద్యం చేయించాలీ అన్నదే నాకు ముఖ్యం గానీ, వాళ్ళు మనకు మిత్రులా, శత్రువులా అన్నది అస్సలు పట్టించుకోకూడదు ! డాక్టరుగా అది నా వృత్తి ధర్మం ! ఎవరికైనా చేయగల సాయం చేయటమే నా ప్రవృత్తి కూడా ! వృత్తి ధర్మానికి ద్రోహం చేయటమంటే...నా దృష్టిలో ప్రాణాలను వదిలేయటమే..! "

ఆ డాక్టరు, కాంపౌండర్ నన్ను గమనించకుండా ఉన్నపుడు జరిగిన సంభాషణ నా మనసులో అలా అప్పటినుండీ గుర్తుండిపోయింది !

అపకారికి ఉపకారం చేయటం గొప్ప అని చెప్పటం, మనం వినటం జరుగుతూంటూందిగానీ ఆచరణలో కుదరని పని అని నా నమ్మకం ! కానీ ఆ రోజు నా నమ్మకం వమ్ము అయింది ! అలాంటి గొప్ప మనిషిని చూడగలిగాననే ఆనందం మనసంతా నిండింది ! ఇన్నేళ్ళకు మళ్ళీ...ఆ డాక్టరు గురించి ఇలా విన్నాను ! అలాంటి మనిషి హత్య చేశారంటే.....నమ్మకం ఎలా కుదురుతుందో మీరే చెప్పండి..? అందుకే...అక్కడున్న జనాలను వాకబు చేసి నా అనుమానం నిజమేనని నిర్ధారణ చేసుకున్నాను. నేను చేయగలిగింది ఏమైనా వుందా అని మధనపడ్డాను. పదిమందికీ మేలు చేసే మంచి మనిషికి శిక్ష పడకూడదనే ప్రయత్నంలో భాగంగానే ముందు మీ దగ్గరకు వచ్చాను...!"

నిర్ఘాంతపోతూ విన్న లాయరు పరమేశం రెండు క్షణాల్లోనే ఆలోచన, ఆశ్చర్యం నుండి బయటపడి ఆవిడతో " ముందు...ఆ డబ్బును మీరు తీసుకోండీ..." అన్నాడు.

ఆవిడ ఒకసారి ఆయన వైపు సూటిగా చూసి, తర్వాత నిర్లిప్తంగా డబ్బు తీసుకుని తన సంచీలో సర్దింది.

" మీరు కేసు ఒప్పుకున్నాక వెనక్కి తీసుకోరనే అనుమానం నాకు ఉండనే ఉంది. అదిపుడు నిజమైంది ! అయితే ఒక మాట మాత్రం చెప్పకుండా ఉండలేకపోతున్నా. జీవితం గడవటం కోసం సంపాదన అనేది అవసరమే ! అలాగే మనిషికి మానసిక సంతృప్తి కూడా అంతకన్నా అవసరం ! వృత్తి ధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తించగలిగే వాళ్ళకే అది దక్కుతుంది ! ఒక న్యాయవాదిగా న్యాయానికి కాకుండా, తెలిసీ అన్యాయానికి భరోసాగా నిలిచేవాళ్ళు మాత్రమే ఉన్నారని నేననుకోవడంలేదు. అందుకే నా వెతుకులాటని ఇక్కడితో ఆపను. కొనసాగిస్తాను ! " అంటూ ఆమె లేచి నిలబడింది.

"ఒక క్షణం ఆగండి ..." అన్నాడు లాయరు పరమేశం. " మీరు నా మాటల్ని పూర్తిగా వినలేదు. వాదించకుండా ఫీజు తీసుకోవడమూ నా వృత్తి ధర్మానికి విరుద్ధమే కదా అనిపించింది. అందుకే డబ్బు వద్దన్నాను. ఎపుడో విన్న మాటల్ని గుర్తు పెట్టుకుని ఏమీ కాని ఒక డాక్టరు నిజాయితీ కి మద్దతుగా నిలబడటం కోసం మీరు స్వంతవాళ్ళతో

పోరాటానికి సిద్ధం కావడం నాలో చాలా ప్రేరణ కలిగించింది. అందుకే ఇన్నాళ్ళూ వృత్తి ధర్మం అనుకుంటూ నేను చేస్తున్న తప్పు తెలుసుకున్నాను. ఇకపై నేను కూడా న్యాయం, ధర్మం ఎటువుంటే అటే వాదించి, ధర్మాన్ని గెలిపించే లాయరుగా మాత్రమే పేరు తెచ్చుకోవాలనుకుంటున్నా. నిజాయితీకి మద్దతు ఇస్తే కలిగే సంతృప్తే పెద్ద ఫీజు ఏ లాయరుకైనా. అంతేకాదు...ఇంకో మాట, మీ ఒంటిమీదున్న బంగారాన్ని చూసి కాదు, బంగారం లాంటి మీ మనసును గ్రహించే అందరూ మిమ్మల్ని 'బంగారమ్మా అని పిలుస్తారని కూడా నాకిపుడు అర్థమైంది...! " ఆయన పెదవులపైకి ఈసారి స్వచ్ఛమైన చిరునవ్వు వచ్చింది.

ఆవిడ ఆయన వైపు సంభ్రమాశ్చర్యాలతో చూసి " నిజంగానా " అంది.

అవునన్నట్లుగా తలవూపిన ఆయన ఆవిడవైపు అలాగే చూసి " ఇంకా ఒక సందేహం ఉందమ్మా...మీవారికి కోపం వచ్చి , మీ కాపురం లో కలతలు వస్తాయేమోననే భయం లేకుండా మీరింత ధైర్యంగా...ఈ పని ఎందుకూ.." అంటూ మాటల్ని అర్ధాంతరంగా ఆపేశాడు.

ఆవిడా చిరునవ్వుతో చూసింది. " కాయకష్టం చేసి అయినా బ్రతకగలననే ధీమా నాకు ఈ ప్రోత్సాహాన్నిచ్చిందనుకుంటున్నా ! ఆపైన...నేనూ మనిషినే కదండీ...మనిషికీ ఓ ధర్మం అంటూ ఉంటుందిగా ! నాదృష్టిలో అన్యాయానికి మద్దతివ్వడమే కాదు....న్యాయానికి మద్దతు ఇవ్వకపోవడం కూడా మనిషి ధర్మం కాదు. నేరం చేసినదాంతో సమానం. ఇంకా చెప్పాలంటే...నా ప్రవృత్తి ప్రకారం కూడా..ఒక నిర్దోషికి శిక్ష పడుతుంటే..మౌనంగా ఉండలేకా...ఈ ప్రయత్నం..! " అంటూ మాటలు ఆపేసి చిరునవ్వుతో చేతులు జోడించింది మానవత్వం మూర్తీభవించిన బంగారమ్మ.